# దేశభక్తి

అక్టోబరు నెల సృష్టించిన రక్తపాతం హిందూదేశానికి కలకాలం మరచిపోలేని చరిత్ర అయిపోయింది. ఆ రక్తపాతం ముఖాముఖి యిద్దరు శత్రువులు పోట్లాడుకోవడం వలన వచ్చినదైతే వీరోచితంగా వుండేది. కానీ, అది నమ్మిన మిత్రుని వెనకనించి పొడిచిన పోటైపోయింది. ఆ దొంగపోటు వేలాది వేడి రక్తాలను ముద్ద కట్టించి, కోట్లకోలది నిజాయితీపరుల హృదయాలు శోకంతో నింపేశాయ్.

చలమయ్య, టెలిగ్రాం అందుకొని అలా నిశ్చేష్టుడై నిల్చుండిపోయిన వేలాది తండ్రులలో ఒకడు. భార్య మాటలు కాస్సేపటివరకు వినిపించలేదు; అవి వినిపించగానే కూలబడిపోయాడు.

అమె గగ్గోలు విని యిరుగుపొరుగు చేరారు.

"ఒక్కగాని ఒక్కకొడుకు - పెళ్ళయినా చేసుకుంటే యీ సరికి వంశమైనా నిలబడేది."

"ఆ భార్య వద్దూ అంటే మిలిటరీకి పంపించాడు. ఏమంటే - దేశభక్తి!"

"గాంధీగారి శిష్యరికం చేసి వార్ధాలో కొన్నాళ్ళుండి పాకీపనికూడా చేశాడట - చలమయ్య."

"మీకు తెలీదు - ఇతడు బ్రాహ్మడు - అవిడ -"

ఈ సంఘటన యీ కుటుంబ చరిత్రపై చుట్టుప్రక్కల వున్నవాళ్ళ వాఖ్యానాలను సృష్టించింది. అభిప్రాయాలు, సానుభూతులు తల్లి శోకానికి ఆనకట్ట కట్టలేక పోయాయ్. అమెకు శోకమే నిత్యం సత్యమైన సముద్రపు హోరైపోయింది. తలచి తలచి కొద్దిరోజులకే అమె యేడవాలన్నా యేడవలేనంతగా నీరసంతో వున్నచోటే కూర్చుండిపోతూంది.

విచారంలో మునిగి యేకాంతంగా కూర్చున్న చలమయ్యకు యీనాటికి, మంచిమీద అపనమ్మకం కలగటంచేత గామోసు, గడచిన రోజులు జ్ఞప్తికి రాసాగినాయ్... అతను హైస్కూలులో చదివే రోజుల్లో ఒకనాడు చెరువు ఒడ్డు మైదానంలో యెవరో వుపన్యసిస్తున్నారంటే- మేష్టారు వెళ్ళవద్దన్నా వెళ్ళాడు. వందమందికిపైగా వున్న పిల్లల్లో అంత ధైర్యం చేసినవాళ్ళు నలుగురే. ఆ మీటింగులో ఖద్దరువస్త్రాలు ధరించి,

గాంధీటోపీ పెట్టుకొని ఒక అజానుబాహుడు వుపన్యసిస్తుంటే పదేపదే ఆవేశంతో "వందేమాతరం - మనదే రాజ్యం" అని అరచాడు. పర్యవసానం లాఠీ దెబ్బలు కాశాడు. పెద్దయింటి మర్యాదస్తుల బిడ్డ అని పోలీసు పెద్ద చెప్పగా అతనితండ్రి వచ్చి "నాయనా, నీ కెందుకురా యిది? క్షమాపణకోరుకో, విడిచిపెట్టేస్తారు," అంటే, "వందేమాతరం - మనదే రాజ్యం" అని తండ్రికి జవాబు చెప్పాడు.

తండ్రి చేతులు పట్టుకొని "నా బాబువు కావూ! మీ అమ్మ యేడుస్తూ కూర్చుంది" అని బ్రతిమాలాడు.

"భరతమాతకు జై" అని అరిచాడు జవాబుగా.

"నీ మీద యెన్ని ఆశలు పెట్టుకున్నాం; నువ్వు గొప్పచదువు చదివి పెద్ద వుద్యోగం చేసి మా వంశానికి వన్నె తెస్తావని ఆశతో వున్నాం!"

"ఆ బానిస కొలువా? మా కొద్దు యీ తెల్లదొరతనం - గాంధీ మహాత్మాకు జై."

"నీ యిష్టం" అన్నాడు తండ్రి చేసేది లేక. చలమయ్యకు ఆ రోజుల్లో ఆశకాదు, ఆవేశం వుండేది. ఆశ పెట్టుకున్నవాళ్ళను తన ఆవేశంతో బాధపెట్టాడు. కొడుకో కొడుకో అని పలవరిస్తూ తల్లి శుష్కించిపోయింది. జైలునించి బైటకు వచ్చేసరికి తల్లి బ్రతికేవుంది. తండ్రి మళ్ళీ చదవమన్నాడు.

"నా కీ బానిసచదువు వొద్దు."

"అయితే యేం చేస్తావ్?"

"హిందీ చదువుతాను."

"పొట్ట పోషణకి ఇంగ్లీషు రావాలి."

"స్వరాజ్యం వస్తుంది. దొరలతోపాటు ఆ భాషను తగిలేస్తాం."

"మనిషి పోయినా అతను కట్టిన యింటిలో కొన్ని తరాలవారు వుంటారు."

చలమయ్య బందరు జాతీయ కళాశాలలో కొన్నాళ్ళు నాయకుల చాటులో మెసిలాడు. వయసు పెరుగుతున్నకొద్దీ వూహాలు పెరిగాయి. వూహాలతోపాటు హృదయం విశాల మయింది. వెర్రి ఆవేశం బదులు, విషయాలను పరిస్థితులను అర్థం చేసుకొని మెసిలాడు. ఎన్నో సత్యాగ్రహాల్లో పాల్గొన్నాడు. నడుం విరిగిపోయినట్లు లాఠీదెబ్బలు తిన్నాడు. జైళ్ళకు పోయాడు. బైటపడ్డాడు. వూరూరూ తిరిగి ఖద్దరు అమ్మాడు. ఆశ్రమాల్లో అంట్లు తోమాడు. అనాథుల సేవ చేశాడు. కావడితో నీరు మోసి కూరలు పండించాడు. కూరలమ్మి నూలు వడికాడు. నూలుతో బట్టలు నేయించుకొని యెదుటివాడికిచ్చి అతని చింకిగుడ్డలు తను తీసుకున్నాడు. తల దాచుకోడానికి, చోటు ఇవ్వటానికి కావలసిన వాళ్లు భయపడినప్పుడు దరిద్రనారాయణులలో ఒకడయ్యాడు. కూరలేనప్పుడు పచ్చగడ్డిపచ్చడి తిన్నాడు. అన్నంలేనప్పుడు అంబలి జుర్రాడు. అతనికి ఆకులలములతో కట్టిన పర్ణశాల కుటీరమయింది. ఆకలి కడుపును ఒకోసారి మంచినీరే నింపింది. ఇవ్వన్నీ యెదుటివారికి కష్టాలుగా కనిపిస్తుంటే, తనకు పరిపూర్ణ ఆనందాన్నిచ్చేవి. మనసు మల్లెపూవులా వికసించివుండేది. కోవెలలో తలపై శెఠగోపం పేట్టే ఎటువంటి నైర్మల్యభావం కలుగుతుందో అలాంటిదే, తలమీదనున్న తెల్లని గాంధీటోపీ వలన కలిగేది. ముతక ఖద్దరు వస్త్రాలు త్యాగానికి గుర్తులై మనుష్యుల

మన్ననలను పొందేవి. లోకంలో యెందరో వెతుక్కొనే సంతుష్టి చలమయ్యలాంటి వారిని వెతుక్కుని వరించేది.

అతను గౌరవించిన ఒక నాయకుడు పిచ్చాపాటిగా ఒకసారి అన్నాడు: "చలమయ్యా స్వరాజ్యం వస్తే మళ్ళీ పోతుందటావా?"

"పోనివ్వం" అన్నాడు యవ్వనం వుబికిన మీసాలు త్రిప్పుతూ. నాయకుని మీసాలు అప్పటికే పండివున్నాయి.

"మన చరిత్ర చూస్తే రావటం పోవటం రెండూ వుంటున్నాయి. ఎంచేతంటావ్?"

చప్పున జవాబు దొరక్క చూస్తున్న చలమయ్య "రెండు కారణాలున్నాయ్: ఒకటి మన కంటిపెట్టుకున్న కులతత్వం, రెండోది ప్రాంతీయ దురభిమానం. మనం కులం పేరుతో, ప్రాంతం పేరుతో, భారతీయులంతా ఒకేజాతి, మనది ఒకే దేశం అని మరచిపోతుంటాం," అన్నాడు.

ఆ మాటలు ఆ రోజుల్లో గుండెకు నాటుకోవటంవల్లనే చలమయ్య కులంలేని పెళ్ళి చేసుకొన్నాడు. అందులో అతీగతీలేని హరిజన బాలికను చేసుకున్నాడు. కన్నవారికి, వారి ఆస్తిపాస్థులకు, వారి సంబంధీకులకు – ఒక్క ఆదర్శానికి తప్పించి, సర్వస్వానికీ దూరమయ్యాడు. భార్యవచ్చాక దేశభక్తితోపాటు ఆమెమీద అనురాగానికి, త్యాగంతోపాటు ప్రేమకు కూడా హృదయంలో చోటు దొరికింది. చోటు చేసుకున్న ప్రేమానురాగాలు రానురాను అధికమై, పూలు కాయలై, పండొకటి రాల్చినట్లు ఒక బిడ్డ ఉదయించాడు. ఆ పండులాంటి పాపడిమీద మమకారం ఆశలను రేకెత్తించింది. ఆశ మాయతాలుకు బిడ్డ. అంచేత ఆశ కారు మేఘమై నిండుజాబిల్లి లాంటి సంతుష్టిని మింగసాగింది. సంసారంలో బాధ్యతలు, అవసరాలు ఎద్దుల్లా ఢీకొని ఆదర్శాల అందాల తీవెలను తుక్కు తుక్కు చేయసాగాయ్.

ఇదివరకు కస్తూరితో నిండిన సీసాలో కన్నీటి బొట్లు కూడా అప్పుడప్పుడూ రాలేవి. కొడుకును విడచి జైల్లలో మగ్గుతున్నప్పుడు, దేశంతోపాటు కుటుంబ శ్రేయస్సుకూడా మనసులో మెదిలేది. పండుగరోజులైనా భార్యాకొడుకులతో గడుపుదామంటే కటకటాల వెనుక వూహల్లోనే గడిపేవాడు. వాడిని గాలికి విడిచిపెట్టేసినట్లు వదిలేశాడు. భార్య నానా అగచాట్లుపడి బిడ్డను పెద్ద చేసినా, ఆమెకు, నేనూ ఒక స్వాతంత్ర వీరుని భార్య నన్న గర్వం కష్టాలను మరచిపోనిచ్చేది. బాబు పెరుగుతున్న కొద్దీ వాడి చదువు ఒక సమస్య అయిపోయింది. అతనిపైన లోలోన ప్రాకుతున్న శ్రీమంతుల అభిమానాలు అతను నోరువిప్పకుండానే సహాయాన్ని అందిచ్చేవి. కొడుకు బాగోగులూ, వృద్ధికోసం సహృదయుల యీవిని నిరాకరించలేదు. జైలునించి బైటపడ్డాక దంపతులిద్దరూ ఖద్దరు వుత్పత్తిలో పాటుపడి జీవితం కొనసాగించారు.

స్వాతంత్ర్యం వచ్చింది. కొడుకు స్వేచ్ఛావాయువులను పీల్చసాగాడు. చక్కదనంతో పాటు వానిలోని చమత్కారమైన సంభాషణ చలమయ్యకు గర్వకారణమైంది. ఇద్దరూ ఒకోసారి యే విషయంపై మాటాడినా కొడుకుదే పైచెయ్యయ్యేది. తూచినట్లు సరిగ్గా చెప్పేవాడు. అంకెలు ఆధారాలతో సహా యే విషయాన్నైనా నిరూపిస్తూ మాటాడేవాడు. అతను చేసిన సృష్టి, అతనికంటే యెన్నో అంతస్థులు పైకి పోవటం

వలన అతనిలో స్వాతంత్ర్యపోరాటంలోని సంగతులకన్నా, కొడుకుతో గడిపిన కాలంలో జరిగిన సంఘటనలు మరపురానివైపోయాయ్.

స్వాతంత్ర్యాన్ని పరిరక్షించే బాధ్యత తనదికాదు. తన తరవాత తరాలది. ఇప్పుడు దానికి గాంధీటోపీ అవసరం లేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఆ గుర్తు విలువ తారుమారైంది. త్యాగపుచిహ్నం స్వార్ధపుచిహ్నం అయిపోయింది. తను యింకా ఆ టోపీ పెట్టుకున్నా, తను ఇంకా త్యాగాలను చేసే పరిస్థితిలో లేడు. ఇదివరకు త్యాగాలు చేసి నిలువగలిగాడంటే దానికి కారణం, అతనికి ప్రజలు అభిమానం గౌరవంతో చేయూత నిచ్చారు. తన త్యాగానికి తను గర్వించేటట్లు చూశారు. ఇప్పుడు ప్రజలు యేవో అనుమానాలతో తన టోపీవైపు చూడగానే అతనిలోని గర్వం కరిగిపోయి సోమరిని చేసింది. ఇప్పుడు తనూ భార్యా బ్రతకడానికి కొడుకుపై ఆధారపడవలసి వచ్చింది.

ఈనాడు చప్పున తెలుసుకున్నాడు - తన కొడుకును దేశరక్షణకోసం పంపి తన జీవితంలో యెన్నడూ చెయ్యని త్యాగం చేశాడని. కొడుకుమీది అపారమైన వాత్సల్యం అతనిని ప్రతిక్షణం కృంగదీస్తున్నా, కొన్ని ఆలోచనలు హృదయాంతరాళంలో సూదులతో పొడుస్తున్నాయ్. తన ఆ రోజుల్లోనించి బైటకు వచ్చిననాడు పోలీసులు నిఘా వుంచినా ఖాతరు చెయ్యకుండా, ప్రజలు పూలదండలతో కాచుకుని కూర్చునే వారు. తన కొడుకు దేశంకోసం ప్రాణాలనే అర్పించాడు. తను జైలుకు వెళ్లడం తప్పించి మరింకేం చేశాడు? 'నా కొడుకు దేశంకోసం ప్రాణత్యాగం చేసినా కన్నీరు కార్చేవారం మేమిద్దరం తప్పించి యింకెవ్వరూలేరు. అధవా వాడి వీరోచితమరణానికి సానుభూతిగా ఒక సభయైనా జరపలేదు. అలాంటి బిడ్డనుకన్న నాకు గర్వించడానికైనా పదుగురు నా బాబును పొగుడుతూ ఒక్కమాటైనా అనలేదు. నా కన్నీరు దేశం కన్నీరు కాదా? నా గర్వం దేశం గర్వం కాదా? నా బాధ మీ అందరి బాధ కాదా? నా నష్టం మీ అందరి నష్టం కాదా? 'ఇలా చలమయ్య ప్రతి క్షణం బాధ పడుతున్నాడు. తనతో జైలుకు వచ్చిన పాత మిత్రుడు యిప్పుడు పెద్ద హోదాలో వున్నాడు. వూళ్ళోకి వచ్చాడు కదా అని మిత్రుని చూడటానికి వెళ్ళిన చలమయ్యతో "ఒక్కడుగదా - బుద్ధి గడ్డి తిన్నదా - మిలటరీకి పంపించావు?" అని మందలించాడు. చలమయ్య జవాబు చెప్పకండా వచ్చేశాడు. వాళ్ళ చిన్నమ్మ యీ వూళ్ళోనే వుంది. ఎవరితోనో అందట: 'అనాడు వీడు జైలుకుపోయి మా అక్కప్రాణం తీశాడు, దాని వుసురు తగిలింది.' ఇక్కడా అక్కడా విన్న ఇలాంటి మాటలబట్టి తన కొడుకును తనే కోరి చంపుకున్నట్లు లోకం తీర్పు యిచ్చింది. ఈ గందరగోళం పడలేక యింట్లో కూర్చుంటే భార్య శోకంతో నిండిన కళ్ళనించి బాణాల్లాంటి ప్రశ్నలు చొచ్చుకునేవి.

"వద్దన్నా యుద్ధానికి పంపారు - నా కొడుకుని చంపిం దెవరు?"

"ఇప్పుడు సోమర్ల మయ్యాం - ఏం తిని బ్రతుకుతాం?"

"మీ మంచికీ త్యాగానికీ ఫలితం ఏం తెచ్చుకున్నారు?"

"మీ పేరిప్పుడు యెందరికి తెలుసు? మీ బాబు మనకి తప్పించి యెందరికి తెలుసు?"

"మీరూ, మీ బాబూ త్యాగంతో చితికిపోయారు. చరిత్రలో నిల్చారా?"

చలమయ్య తనపై నలువైపులనించి దాడిచేస్తున్న ప్రశ్నల పరంపరకు తట్టుకోలేక కన్నీరు తెచ్చుకున్నాడు. కాస్సేపయ్యాక తెములుకొని "భక్తికి కోరికలు జతపరుస్తే అది భక్తికాదు. నే నేదో కాంక్షించి దేశభక్తి చూపిస్తే అది అహంమీద నా కున్న భక్తి గానీ దేశభక్తి కాదు. నా పేరు చరిత్రలో కాదు – నా ఆత్మలో రాసుకోనీ."

ఈ ఆలోచనలు కన్నీటి బొట్లను కంటిలోనే దాచాయ్. అయినా ముడిచిన హృదయం మళ్ళీ వికసించలేదు. ముకుళించిన మనసు మళ్ళీ విడివడలేదు. నిస్సహాయత నఖశిఖపర్యంతం ప్రాకిపోయింది. బ్రతుకు బూడిదలా కనిపించింది. అందం అస్థిపంజరంలా తోచింది. కాలం ముళ్ళడొంకలా మీదనించి బాధగా కదలుతోంది. మనిషి మంగలికత్తిపైన నడుస్తున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో కొడుకు సామాన్లు ఒక పెద్ద ట్రంకు పెట్టెతో యింటికి వచ్చాయ్. ఆ పెట్టె యిదివరకు కొడుకు వచ్చినప్పుడల్లా తెచ్చేవాడు. ఇప్పుడు అది యజమాని లేకుండా ఒంటిగా వచ్చింది. అప్పుడు ఆ పెట్టె తీసి తల్లికి చీరలు, తండ్రికి ఖద్దరుబట్టలతోపాటు అతనికి యిష్టమైన పుస్తకాలు వగైరా అందిచ్చేవాడు. ఆ పెట్టె విప్పటానికి చలమయ్యకు యిప్పుడు ధైర్యం చిక్కలేదు. అప్పటికే యింట్లో భార్య గగ్గోలు – "నీవు రాకుండా నీ పెట్టె నెందుకు పంపించావు బాబూ? నాకు నీ డబ్బూ వద్దు, నీ చీరలూ వద్దురా నాయనా! నీవు కావాలిరా బాబూ, రా నాయనా రా!"

చలమయ్య పెట్టె తెచ్చిన వాళ్ళను పంపించేశాడు. రెండురోజుల వరకు నిద్దర పట్టలేదు. కొడుకు యింట్లోనే మసలుతున్నట్లు, వాడితో తను యిదివరలా శలవుల్లో వచ్చేటప్పుడు రాజకీయాలు గురించి, సాంఘిక జీవనం గురించి చర్చిస్తున్నట్లు, కొడుకు తను చూసిన స్థలాల్లో జరిగే వింతలూ, ఆ ప్రజల జీవిత విధానాలూ, అక్కడ చూసిన గుడులూ, గోపురాలూ, శిల్పాలూ, కట్టడాలూ – ఇవన్నీ చెప్తుంటే తను చూడలేకపోయినా, కొడుకు దేశాన్ని చూస్తున్నందుకు తను పొందే గర్వం – యిలా యీనాడూ పొందేటట్లు లేచిపోతున్నాడు. ఇంట్లోనే యిటూ అటూ తిరుగుతున్నాడు. ఇదివరకు సంతోషంతో కూడిన ఆందోళన. ఇప్పటి ఆందోళనను దుఃఖం ముసుగు కప్పింది. ఆందోళన తప్పించి యింకే అనుభూతీ అతనిలో కలగలేదు. పెట్టెపెట్టిన గదిలో రాత్రంతా ఒంటరిగా ఖంగారుపడిపోతూ ఉన్నాడు. లేవటం నిల్చోవటం, కిటికీ గుండా ఆకాశంవేపు చూడటం – కొడుకు యే మారుమూలల్లో, కొండల్లో కోనల్లో, అడవిలో మంచులో – ఎక్కడ పోట్లాడాడో – యెందరి శత్రువులను చంపాడో – యీ ఒరిగిన వీరుణ్ణి యింకా ప్రకృతి గాలికంఠంతో జోల పాడి, మంచు టుయ్యాలలో నిద్రపుచ్చుతుందో ఏమో లేక తన ఒడిలో వేసుకొని మంటి చీరకొంగుతో కప్పి మేఘాల కంటిరెప్పలనించి కన్నీరు రాల్చిందేమో?

"అయ్యో – నా ఒక్కడికే కాదు కొడుకు మీద అభిమానం. మింటి చుక్కలు మిణుకు మిణుకుమని నా బాబు సమాధిమీద వెలుగుని ప్రసరిస్తూన్నాయ్. మనోహరంగా పూసిన పూలు సమాధిపై రాలి నా బాబు నోటిలో తేనె పోస్తూన్నాయి. నా యెదరగా నున్న సముద్రం నా బాబుకోసమే హోరెత్తి యేడుస్తోంది – కాదు – నా

బాబు త్యాగాన్ని వర్ణిస్తోంది. మనుష్యుల మాటలకు చావుందిగానీ ప్రకృతి ఘోషకు చావెక్కడిదీ? ఈ మారే మనుష్యులు నా కొడుకు త్యాగాన్ని కీర్తించకపోతే పోయె – యీ మారని సుందరమైన ప్రకృతి నా బాబును తన పొట్టలో నుంచుకొని – గాలీ, వెలుగూ, నీరూ, ఆకాశం, అగ్నితో నిత్యం కీర్తిస్తూ పోషిస్తోంది."

చలమయ్య ఆందోళనను మంచి ఆలోచనతో తగ్గింప చూశాడు. తూర్పు తెలతెలవారుతుంటే తన మనసులో వెలుగు లీలగా చొచ్చుకుపోతోంది. మెల్లగా పెట్టె విప్పాడు. కొడుకు బట్టలు, పుస్తకాలు, ఇంకెన్నెన్నో సామానులున్నాయి. ఇంకా తిరగవేస్తుంటే కెమేరా కనబడింది. దాని క్రింద నల్ల అట్టలతో ఒక పెద్ద ఆల్ బమ్ కనపడింది. అప్పటికి తెల్లవారింది. సముద్రంలో సూర్యోదయమైంది. కిటికీ గుండా సూర్యరశ్మి పడుతుంటే కుర్చీమీద కూర్చుని టేబిల్‌మీద ఆ అల్బమ్‌పెట్టి విప్పాడు. విప్పగానే కొడుకుఫోటో యెదురైంది. ఒక్కసారి కళ్ళలో నీరు చిమ్మి తలపైకెత్తేశాడు. ఎదురుగా నున్న విశాల సముద్రంలోని నీరంతా తన కళ్ళల్లో యిమిడినట్లయిపోయింది. ఓ క్షణంపోయాక చేతితో కళ్ళు తుడిచి కన్నీరు కార్చకండా కళ్ళను బుజ్జగించాడు. ఆ కొడుకు ఫొటో ప్రక్కనే యింకో ఫొటో వుంది. ఆ ఫొటో యిదివరకు తను చూడలేదు. పికపికలాడే యౌవనంతో ప్రేమమూర్తిలా అందంతో వెలిగిపోతోంది. ఆ బొట్టూ తీరూ చూస్తే ఆమె బెంగాలీకన్యలా వుంది. చప్పున చలమయ్యకు ఒకనాడు కొడుకుతో యీ గదిలోనే అన్న మాటలు జ్ఞప్తికి వచ్చినయి.

"కులంలేని పెళ్ళి చేసుకొని, నేను కులతత్వాన్ని యెదుర్కొన్నాను. దేశంలో యింకో ప్రాంతం పిల్లను నువ్వు చేసుకొని ప్రాంతీయ తత్వాన్ని యెదుర్కో నాయనా!"

"బహుశః యీ తండ్రి కోర్కెను మన్నించి నా బాబు యీమెను ప్రేమించి వుంటాడు. అంతా స్థిరం చేసుకొని ఈసారి శలవుల్లో వచ్చేటప్పుడు 'నాన్నా మీ కోరిక నెరవేరుస్తున్నా'నని సంతోషంగా చెప్పేవాడేమో! వాళ్ళిద్దరకూ కలిగిన సంతానం అసలు భారతీయులయ్యేవారు. ఇలాంటి నా కొడుకు సంతతిని చూసి గర్వించే భాగ్యం నాకు కలగలేదు, నా వెర్రితల్లి యెక్కడుందో? ఈ ఘోర వార్త తెలియక యింకా యెన్నికలలు కంటూందో? ఈ వార్త తెలిస్తే ఆమె యేమౌతుంది?"

చలమయ్యకు ఆమె దుఃఖం తలచుకుంటే గుండె చెరువైపోయింది. ఏమి యుద్ధాలు, యేమి కావేశాలు? యేమి ఆశలు? మనిషికీ మనిషికీ, దేశానికీ దేశానికీ మధ్యను ఈ అడ్డుగోడ లెందుకు? యీ భూమిమీదున్న మానవులు అంతా ఒక్కటే అయినప్పుడు దేశభక్తి యెందుకు? మనిషికి యెదుటిమనిషిమీద భక్తి వుంటే చాలాదా?

ఒక క్షణం అలా అల్బమ్ మొదటిపేజీవేపు చూస్తూనే "నువ్వు ఒక వ్యక్తిని, అతని ఆస్తిని, హద్దులను గౌరవించేటప్పుడు ఆ వ్యక్తి నిన్ను, నీ ఆస్తిని, హద్దులను గౌరవించకపోతే చచ్చిన మనిషిలా వూరుకుంటావా? మనుష్యులే దేశం; దేశాలే ప్రపంచం. మనుషుల్లో కీచులాట లున్నంతకాలం దేశాలకు జట్టీలు తప్పవు."

ఈ తర్కాలు మాని యింకోపేజీ తిప్పాడు. పేజీలు తిప్పుతుంటే తన కొడుకు దేశం నలుమూలలా తిరిగాడనీ, దేశం అందాన్నీ, ఐశ్వర్యాన్నీ, జీవిత విధానాలనూ, ప్రజల ఆశలనూ ఆవేశాలనూ తనకున్న ఫొటోగ్రఫీ పిచ్చితో అర్థం చేసుకున్నాడని వ్యక్తమైంది.

చలమయ్య ఒక్కొక్క పేజీ తిప్పుతుంటే బొమ్మలనికాదు చూచింది; అవన్నీ కళ్ళయెదుట నిల్చున్నాయ్. తనే ఆ ప్రదేశాలన్నీ పోయి చూసినట్లున్నాయ్. అవిగో – మంచుతో నిండిన హిమాలయాలూ – అల్లదిగో – కేదార్ నాథ్ దేవాలయం, గంటలు వినిపిస్తున్నాయ్ – కాశీ విశ్వేశ్వరుడు – బుద్ధగయలో మూల గంధకుటీ విహారంలో బుద్ధుని బోధనలు ప్రతిధ్వనిస్తున్నాయ్ – ఇటు మధురలో వేణుగానం వినిపిస్తోంది – అమృతసర్‌లో బంగారు దేవాలయం, జుమ్మామసీదులో వేలాది ప్రజల నమాజు. తూర్పు రోమ్ అయిన గోవాలో చర్చి గంటలు మ్రోగుతున్నాయ్ – తిరుమలలో గోవిందుని గోపురం – మధుర మీనాక్షి దేవాలయం – మూడు సముద్రాలు పాలకెరటాలతో కన్యాకుమారి పాదాలను ప్రక్షాళన చేస్తున్నాయ్ – వెన్నెల్లో తాజమహల్, ఆకాశానికి అంటుకుంటున్న కుతుబ్ – అట్టహాసంతో నున్న ఫతేపూర్ సిక్రీ, అజంతా, పరుగులెడ్తున్న కోణార్క సూర్యరథం, ఖజురాహోలోని దేవాలయాలపై ప్రాణం పోసుకున్న మిధున విగ్రహాలు – మహాబలిపురంలోని రాతి రథాలు – హంపీ– హోయసాలుల సోయగం చెక్కిన హలబీడ్, లేపాక్షి బసవయ్య, ఎల్లోరాలోని కైలాసనాథ్ దేవాలయం – అమరావతిలోని బౌద్ధ స్థూపం – అశోకుని ధర్మచక్రం, సాంచీ, సోమనాథ దేవాలయం – భాక్రా నంగల్, దామోదరలోయలోని మైథన్‌డామ్, భిలాయ్ ఉక్కు కర్మాగారం – చిత్తరంజన్ రైళ్లు, హిందూస్థాన్ ఓడల విమానాల కర్మాగారాలూ, అణుశక్తి రియాక్టర్ – ఓడల్లో సరుకుల యెగుమతి దిగుమతులు, ప్రయాగలో సంగం, గోదావరి ఆనకట్ట, అస్సాం తేయాకు తోటలు – ఉత్తర ప్రదేశ్ చెరుకు, బంగాళపు జనుము, ఆంధ్రప్రదేశ్ వరి, పంజాబ్ గోధుమపంటలు– వీటన్నిటినీ ఆరాధించే ప్రజల జీవిత విధానాలూ, వేష భాషలూ, సంగీత సాహిత్యాలూ, తరతరాల నించీ వస్తున్న వేడుకలూ, అనురాగాలూ, ఆశయాలూ – ఇవన్నీ ఒక దేవతావిగ్రహంలా ప్రతి భారతీయునికీ పవిత్రం కాగా, ఆ విగ్రహాన్ని రథంలో పెట్టి వూరేగించేటప్పుడు రథం లాగేవాళ్ళలో తనూ తన కొడుకూ ఒకరు కావటం యెంత అదృష్టం – ఎంత అదృష్టం!

☆ ☆ ☆ ☆

చలమయ్య అప్పుడే దగ్గరకు వచ్చిన భార్యను చూడగానే చప్పున లేచిపోయి ఆనందబాష్పాలు తుడుచుకుంటూ ఆవేశంతో "ఏడవటాని కిది సమయం కాదు. మనం సంతోషంతో వుప్పొంగిపోవాలి. మన బాబు – మన దేశపు భూత, వర్తమాన, భవిష్యత్తులను నరకాలని వచ్చిన రాక్షసుని యెదిరించిన వేలాది వీరుల్లో ఒకడయ్యాడు. అలాంటి వీరుణ్ణి కన్న తల్లితండ్రులుగా మనం గర్వించాలి. నా బాబు నా జన్మభూమి చరిత్రలో భాగమే అయిపోయాడు!" అన్నాడు.

*(యువ 1963)*

*(హిందీ అనువాదం: ఏప్రిల్ 1966, యుగప్రభాత్‌లో ప్రచురింపబడినది)*